ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
ఆదివారం 18 ఆగస్టు 2024



గిరిజన కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

తాండూరు రూరల్, ఆగస్టు 17: తాండూరు మండలంలోని జినుగుర్తి గిరిజన బాలికల కళాశాలలో మిగిలిపోయిన సీట్లకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటమ్మ పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ -14సీట్లు, బైపీసీ-8 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. గిరిజన విద్యార్థులతోపాటు గిరిజనేతరులు కూడా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈనెల 18, 19వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

నిరసనలు



వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో ధర్నా నిర్వహిస్తున్న వైద్యులు, విద్యార్థులు

కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన ఘటనకు నిరసనగా వికారాబాద్ పట్టణంలో వైద్యులు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వైద్యులు, ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులు, మహవీర్ మెడికల్ కళాశాల విద్యార్థులతో కలిసి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి ఎన్టీఆర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు.

- వికారాబాద్, ఆగస్టు 17



కులకచర్లలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ

బంగ్లాదేశ్‌లో హిందువులపై, హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం కులకచర్లలో బంద్ నిర్వహించారు. ఉదయం నుంచి వ్యాపారులు, కిరాణా దుకాణాల యజమానులు, హోటళ్లు స్వచ్ఛందంగా మూసి వేశారు. హనుమాన్ దేవాలయం నుంచి పెద్ద గేటు వరకు ర్యాలీ నిర్వహించారు.

- కులకచర్ల, ఆగస్టు 17



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

గురుకులాల్లో మౌలిక వసతులకు ప్రత్యేక చొరవ చూపాలి

కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, ఆగస్టు 17: గురుకుల పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో గురుకుల పాఠశాలల నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పనపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలల సంక్షేమ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకులాల్లో విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించాలన్నారు. మొదటి ప్రాధాన్యతగా తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని సూచించారు. పనులు చేపట్టకముందు, పనులు పూర్తి అయిన తర్వాత తీసిన ఫొటోలను సమర్పించాలని అధికారులకు సూచించారు. జిల్లా అధికారులను ప్రత్యేక అధికారులుగా నియామకం చేసి పనులు పర్యవేక్షించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. మేజర్ పనులు ఏవైనా ఉంటే ప్రతిపాదనలు రూపొందించి సమర్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, మల్లేశం, గిరిజన అభివృద్ధి అధికారి కమలాకర్‌రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ బాబు శ్రీనివాస్, ప్రిన్సిపాళ్లు, పాల్గొన్నారు. కాగా, ప్రభుత్వ ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందడంలో ఏవైనా సమస్యలు ఉంటే సమాచారం అందించాలని కలెక్టర్ తెలిపారు. వాట్సాప్ నెంబర్‌కు 7780478817 మెసేజ్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు. వికారాబాద్ జిల్లా ప్రజలు ఆరోగ్య విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. ప్రజలు సమాచారం అందిన వెంటనే మా బృందం మీకు అందుబాటులో ఉండి సహాయపడుతుందని కలెక్టర్ తెలిపారు.

టీబీ రోగులకు సక్రమంగా మందులివ్వాలి

రాష్ట్ర హెల్త్ అండ్ టీబీ జాయింట్ డైరక్టర్ డాక్టర్ రాజేశం



వైద్యులతో మాట్లాడుతున్న రాజేశం

శామీర్‌పేట, ఆగస్టు 17: టీబీ రోగులను సక్రమంగా మందులను ఇవ్వాలని రాష్ట్ర హెల్త్ అండ్ టీబీ జాయింట్ డైరక్టర్ డాక్టర్ రాజేశం వైద్యులను ఆదేశించారు. శనివారం శామీర్‌పేటలోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లోని టీబీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. మందుల స్టాక్, రికార్డులను ఆయన పరిశీలించారు. ఆస్పత్రికి రోజు ఎంత మంది టీబీ రోగులు వస్తున్నారని, నెలలో ఎంత మంది టీబీ రోగులు నమోదు చేసుకుని మందులను తీసుకుంటున్నారని డాక్టర్లు రవీందర్, శ్రీదేవిని అడిగి తెలుసుకున్నారు. టీబీ నివారణ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యులకు సూచించారు.



ప్రకృతి వైపరీత్యాలు, ప్రతికూల పరిస్థితుల్లో పంటలు దెబ్బతిని రైతులు నష్టపోకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫసల్ బీమా పథకం రాష్ట్రంలో అమలు కావడం లేదు. కొన్నేళ్లుగా రాష్ట్రంలో ఫసల్ బీమా పథకం అమలుకు నోచుకోకపోవడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతూ వచ్చారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తామని నిర్ణయించినా ఇంత వరకూ మార్గదర్శకాలు విడుదల కాలేవు. వానాకాలం సాగు ప్రారంభించి రెండు నెలలు గడిచి పోయినా ఇంత వరకు ఫసల్ బీమా పథకం అమలుకు సంబంధించిన విధి విధానాలు వెలువడలేదు. దీంతో పంటల బీమాకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఫసల్ బీమా పథకం ఈ వానాకాలం సీజన్‌కు వర్తిస్తుందా? లేదా ?అనేది అన్నదాతల్లో సందిగ్ధం నెలకొంది.

బీమా.. ఏదీ ధీమా!

ఫసల్ బీమా పట్టాలెక్కేది ఎప్పుడో?

- పథకం అమలుపై కొనసాగుతున్న సందిగ్ధత
- జారీ కానీ మార్గదర్శకాలు..
- రైతులకు తప్పని ఎదురు చూపులు

వికారాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండానే వారు సాగు చేసే పంటలకు బీమా సదుపాయం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అన్నదాతల నుంచి ఎలాంటి ప్రీమియం వసూలు చేయకుండా.. ప్రభుత్వమే ఫసల్ బీమాకు సంబంధించిన ప్రీమియం మొత్తం చెల్లించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే ఫసల్ బీమా పథకం అమలుకు సంబంధించి ఇంత వరకు ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయి మార్గదర్శకాలు విడుదల కాలేదు. ఫలితంగా రాష్ట్రంలో వానాకాలం సీజన్‌లో ఫసల్ బీమా పథకం అమలు ఏ మేరకు సాధ్యమవుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. గత కొన్ని సంవత్సరాలుగా రాష్ట్రంలో ఫసల్ బీమా పథకం అమలుకు నోచుకోకపోవడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతూ వచ్చారు. వానాకాలంలో సీజన్‌లో కురిసే కుంభవృష్టి వర్షాలతో జిల్లాలో వేలాది ఎకరాల్లో రైతులు పంటలు నష్టపోతున్న విషయం తెలిసిందే. రైతులు సాగు చేసే పంటలకు ప్రభుత్వ పరంగా ఎలాంటి బీమా పథకాలు అమలు చేయకపోవడంతో అధిక వర్షాలతో రైతులు పంటలు నష్టపోతూనే ఉన్నారు.

ఈ సీజన్‌లో బీమా వర్తించేనా?

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పంటల బీమా అవసరాన్ని గుర్తించి ఫసల్ బీమా పథకాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించింది. ఈ వానాకాలం సీజన్‌లో పత్తి, కంది, మొక్కజొన్న, పెసర, మినుము తదితర పంటల సాగు చివరి దశకు చేరుకుంది. వరి సాగు ఇంకా పూర్తి కాలేదు. కురుస్తున్న వర్షాలతో పంటల సాగు మరింత పెరిగే అవకాశం ఉంది. అయితే సెప్టెంబరు నెలాఖరు వరకు వర్షాలు కురిసే అవకాశం ఉంది. పంటలు ఎదిగే దశలో భారీ వర్షాలు కురిస్తే రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం పొంచి ఉంది. రైతులు సాగు చేసే పంటలు ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోకుండా ఫసల్ బీమా పథకం అమలు చేయాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను ఇది వరకే విడుదల చేసి ఉంటే ఈ సీజన్‌లో సాగు చేస్తున్న పంటలకు ప్రయోజనం చేకూరేది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఫసల్ బీమా పథకం అమలు చేసే విషయమై సత్వర నిర్ణయం తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ వానాకాలం సీజన్ నుంచే అమల్లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక అనుమతి తీసుకోవాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.



5.98 లక్షల ఎకరాల్లో సాగు..

నాలుగేళ్ల కిందట రెండేళ్ల పాటు వరుసగా కురిసిన వర్షాలతో జిల్లాలో రైతులు వేలాది ఎకరాల్లో పంటలు నష్టపోయారు. జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 5.98 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయాధికారులు అంచనా వేయగా, ఇప్పటి వరకు 4.43 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. వేసిన పంటలు ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోకుండా ఉండేందుకు పంటల బీమా పథకం రైతులకు ఎంతో ఉపయోగపడనుంది. సాగు చేసే పంటలకు బీమా కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఫసల్ బీమా పథకం ప్రవేశపెట్టింది.

కాగా, కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమలవుతున్న ఈ పథకాన్ని అమలు చేసేందుకు గత రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రాలేదు. గతంలో కేంద్ర ప్రభుత్వం 40 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం ప్రీమియం వాటా చెల్లిస్తే... రైతులు తమ వాటాగా 20 శాతం ప్రీమియం చెల్లించేవారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వం మధ్య నెలకొన్న విబేధాలే ఇందుకు కారణమనేది అందరికీ తెలిసిందే.

అంతర్రాష్ట్ర శికారి గ్యాంగ్ అరెస్ట్

- తండ్రీకొడుకులే ప్రధాన నిందితులు
- కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణలో ఇద్దరిపై 112పైగా కేసులు
- జూన్ 30న పరిగిలో ఐదు ఇళ్లలో చోరీ
- వివరాలు వెల్లడించిన ఎస్పీ నారాయణరెడ్డి



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి



పోలీసులు అదుపులో శికారి గ్యాంగ్ నిందితులైన తండ్రీకొడుకులు

వికారాబాద్, ఆగస్టు 17: తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రాల్లో వరుసగా దొంగతనాలు చేస్తున్న శికారి గ్యాంగ్‌ను అరెస్ట్ చేయడం జరిగిందని, పరిగి పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఐదు ఇళ్లలో దొంగతనం చేయడంతో దర్యాప్తు చేసి పట్టుకున్నామని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంతకల్‌కు చెందిన శికారి గ్యాంగ్‌లో ప్రధాన నేరస్తులైనా తండ్రి పెద్ద సర్దార్, కుమారుడు శికారి మద్దిలేటి, సమీప బంధువులు చిన్న సర్దార్ అలియాస్ గబ్బార్ సింగ్‌లు జూన్ 29న రైలు మార్గం ద్వారా యాద్గిర్ అక్కడి నుంచి పరిగికి బస్సు మార్గం ద్వారా ఉదయం చేరుకున్నారు. 30వ తేదీన ఉదయం పరిగిలో రెండు షోలు సినిమా చూసిన నిందితులు రాత్రిమద్యం సేవించి రక్కి నిర్వహించారు. పరిగిలో తాళాలు వేసిన ఐదు ఇళ్లను వారు గుర్తించారు. రాత్రి సమయంలో ముగ్గురు వ్యక్తులు ఐదు ఇళ్లలో దొంగతనం చేయగా అందులో ఓ ఇంటిలో 12 తులాల బంగారం, 1.20లక్షల నగదు, మరో ఇంటిలో 3.3 తులాల బంగారాన్ని దొంగలించారు. మూడు ఇళ్లలో దొంగలకు ఎలాంటి బంగారం, నగదు దొరకకపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, టెక్నికల్ ఆధారాల ద్వారా నిందితులు గుంతకల్‌కు చెందిన శికారీ గ్యాంగ్‌గా గుర్తించడం జరిగిందన్నారు. అందులో చిన్న సర్దార్‌ను జూలై 29న అరెస్ట్ చేసి విచారించడం జరిగిందని, తండ్రీ కొడుకులు పూణెలో ఉన్నారని సమాచారం రావడంతో శుక్రవారం వారిని పూణెలో అదుపులోకి తీసుకోవడం జరిగిందని ఎస్పీ తెలిపారు. తండ్రి కొడుకులు శికారీ గ్యాంగ్‌లో ప్రధానమని, వారు దొంగతనం చేసే సమయంలో మూడో వ్యక్తిని కొత్త వారిని తీసుకెళ్తారని పేర్కొన్నారు. ఓ సారి బూజు, తేజ అనే కొత్త వ్యక్తులను దొంగతనాలకు తీసుకోని పోయేవారని విచారణలో తెలిసిందన్నారు. పెద్ద సర్దార్‌పై అన్ని రాష్ట్రాల్లో కలిపి 70కి పైగా కేసులు ఉన్నాయని, శికారి మద్దిలేటిపై 42 దొంగతనం కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. వారి వద్ద పది తులాల బంగారం రికవరీ చేయడం జరిగిందని, బంగారం కొనుగోలు చేసిన శికారి ఆది, పుణెకు చెందిన కంసార్ రాంచందర్ చవాస్‌పై కేసు నమోదు చేశామన్నారు.

ఈ కేసును చేధించిన పరిగి సీఐ శ్రీనివాస్, సీసీఎస్ సీఐ బలవంతయ్య, పరిగిఎస్ఐ సంతోష్, హెడ్ కానిస్టేబుల్స్ జయవర్ధన్, చెన్నయ్యగౌడ్, గోవిందప్ప, కానిస్టేబుల్స్ కృష్ణరెడ్డి, అంజప్ప, సత్తయ్య, రాజు, రాఘవేందర్ రెడ్డి, రామకృష్ణ గాయత్రిలకు రివార్డు అందించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

ఇద్దరు పిల్లలతో సహా.. చెరువులో దూకి తల్లి ఆత్మహత్య

- కుటుంబ కలహాలే కారణం..
- తల్లి, కూతురి మృతదేహాలు లభ్యం
- కుమారుడి మృతదేహం కోసం గాలింపు



భానుప్రియ, దీక్ష, వేదాన్ష్ ఆనంద్(ఫైల్)

మూడుచింతలపల్లి, ఆగస్టు 17: ఇద్దరు పిల్లలతో సహా తల్లి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాద ఘటన మేడ్చల్ జిల్లా శామీర్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రానికి చెందిన మర్కంటి భానుప్రియ(28) ఈనెల 15వ తేదీన రాత్రి తన భర్త మర్కంటి స్వామితో గొడవపడి కుమారుడు దేవాన్ష్‌ఆనంద్(5), కూతురు దీక్ష(4)లతో కలిసి బయటకు వెళ్లింది. రాత్రి వెతికినా అచూకీ లభ్యం కాకపోవడంతో స్వామి మరుసటిరోజు ములుగు పోలీస్‌స్టేషన్‌లో భార్య, ఇద్దరు పిల్లలు తప్పిపోయారని ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా శనివారం సాయంత్రం ఓ మహిళ, ఇద్దరు పిల్లలతో కలిసి శామీర్‌పేట పెద్ద చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన స్థానికులు మహిళ, చిన్నారి మృతదేహాలను వెలికితీసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు వారి మృతదేహాలను పరిశీలించి ములుగుకు చెందిన భానుప్రియ, చిన్నారి దీక్షగా గుర్తించారు. కుమారుడు దేవాన్ష్‌ఆనంద్ మృతదేహం కోసం గాలింపుచర్యలు చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఎంఈవో కార్యాలయం ఆవరణలో వరద నీరు



ఉధృతంగా ప్రవహిస్తున్న సిరిపురం వాగు

ఉప్పొంగిన సిరిపురం వాగు

మర్పల్లి/వికారాబాద్, ఆగస్టు 17: వికారాబాద్ జిల్లాలో శనివారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మర్పల్లి మండలంలో కురిసిన భారీ వర్షానికి చెరువులు, కుంటలు పొంగిపొర్లాయి. సిరిపురం వాగులో వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో దాదాపు రెండు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. మర్పల్లి నుంచి మోమిన్‌పేట్‌కు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో ప్రజలు వాగు దాటేందుకు ప్రయత్నించొద్దని ఎస్సై సురేశ్ సూచించారు. భారీ వర్షం కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఎంఈవో కార్యాలయం ముందు వరద నీరు చేరడంతో చెరువును తలపించింది. అంతేకాకుండా వికారాబాద్ జిల్లా కేంద్రంలో భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని రోడ్లు చిత్తడిగా మారాయి.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మేడ్చల్ టౌన్, ఆగస్టు 17 : విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి సూచించారు. శనివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ మల్లారెడ్డి ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో యాంటీ డ్రగ్స్, ర్యాగింగ్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో డీసీపీ హాజరై మాట్లాడారు. మాదక ద్రవ్యాలు విక్రయించే స్మగ్లర్లు కళాశాలల విద్యార్థులను టార్గెట్‌చేసి వ్యాపారం చేస్తున్నారని, కాలేజీ పరిసరాల్లో గానీ, ఇతర ప్రాంతాల్లో ఎవరైనా మాదక ద్రవ్యాలు విక్రయిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎడ్యుకేషన్ హబ్‌గా ఉన్న మైసమ్మగూడ ప్రాంతంలో వారానికి ఒకసారి తమ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుందన్నారు. ర్యాగింగ్‌ను ప్రోత్సహించరాదని ఆయన అన్నారు. ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, పేట్‌బషీరాబాద్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

ట్రెక్కింగ్ చేసిన ఎంపీ కొండా




బంట్వారం, ఆగస్టు 17: మండల సరిహద్దు కర్ణాటకలోని కుంచారం సమీపంలో ఉన్న ఎత్తిపోతల జలపాతం పరిసరాల్లో శనివారం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ట్రెక్కింగ్ చేశారు. ఆయన వెంట బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాండూర్ రమేష్, బీజేపీ వికారాబాద్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు, పార్టీ మండలాధ్యక్షుడు తదితరులున్నారు.





రైతులను సముదాయిస్తున్న ఏడీఏ రుద్రమూర్తి

బషీరాబాద్, ఆగస్టు 17: బషీరాబాద్ మండల కేంద్రంలోని నవాంధ్ర సొసైటీలో శనివారం రైతులు యూరియా కోసం ఎగబడ్డారు. ఒక్కొక్కరూ 5 నుంచి 10 బస్తాల యూరియా అడగడంతో సొసైటీ సిబ్బంది నిరాకరించడంతో రైతులు ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న తాండూరు ఏడీఏ రుద్రమూర్తి అక్కడికి చేరుకుని సొసైటీ సీఈవో బండెయ్యతో యూరియా నిల్వలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కసారిగా అవసరం లేకున్నా పెద్ద సంఖ్యలో రైతులు యూరియా కొనుగోలు చేసి ఇళ్లకు తరలించి నిల్వ చేసుకోవడంతో మిగతా రైతులకు కొరత ఏర్పడుతుందని పేర్కొన్నారు. అవసరం మేరకు తీసుకెళ్తే మిగతా రైతులకు కూడా యూరియా ఇబ్బంది లేకుండా ఉంటుందని రైతులకు వివరించారు. యూరియా అవసరం మేరకు తీసుకెళ్లాలని రైతులకు సూచించారు.ఒక్కో రైతుకు ఎకరాకు ఒకటి, రెండు బస్తాలు ఇస్తామని, మళ్లీ స్టాక్ వస్తుందని అప్పుడూ తీసుకెళ్లాలని రైతులకు విన్నవించారు.ఆయన వెంట ఏఈవో పవాన్, శ్యామేల్ తదితరులున్నారు.



పశువుల పెంపకంపై అవగాహన కలిగి ఉండాలి

మూడు చింతలపల్లి, ఆగస్టు 17 : పశువుల పెంపకం, పౌల్ట్రీ పరిశ్రమల నిర్వహణపై మహిళలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని డీఆర్డీఏ పీడీఏ లత అన్నారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా శనివారం మూడుచింతలపల్లిలో మహిళా సమాఖ్య సభ్యులకు పశుసంవర్ధక శాఖ అధికారులతో ప్రత్యేకంగా శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఏ లత మాట్లాడుతూ పశు పోషణ, పౌల్ట్రీ నిర్వహణ పట్ల పూర్తి అవగాహన కలిగి ఉన్న మహిళలకు ఆర్థిక సాయం అందజేసి పాడి, పౌల్ట్రీ పరిశ్రమలు నెలకొల్పటానికి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని సమాఖ్య సభ్యులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారులు, ఏపీఎం మునిస్వామి, మండల సీసీలు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న డీఆర్డీఏ అధికారులు

ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికే కరెంట్ తీస్తున్నారా?

● విద్యుత్ అంతరాయంపై అధికారులను నిలదీసిన కాంగ్రెస్ నాయకులు


సబ్‌స్టేషన్ వద్ద అధికారులను నిలదీస్తున్న నాయకులు

ధారూరు, ఆగస్టు 17: ప్రభుత్వం కరెంట్ కోతలు అమలు చేస్తుందా? చీటికీమాటికీ కరెంట్ తీస్తూ ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారా? అని ధారూరుకు చెందిన కాంగ్రెస్ నాయకులు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏఈ వేణుగోపాల్‌రెడ్డితో పాటు సిబ్బందిని నిలదీశారు. ఈ సంఘటన శనివారం ధారూరు సబ్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ధారూరు గ్రామంలో చీటికీమాటికీ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని, ప్రతీరోజు గంటల తరబడి సరఫరాలో అంతరాయానికి కారణమేమిటని ఏఈని ప్రశ్నించారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి ధారూరులో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తాగునీటికి ఇబ్బందిగా మారిందని తెలిపారు. రాత్రిపూట కరెంట్ తీస్తున్నారని, దోమల బెడదతో ప్రజలు సరిగ్గా నిద్రపోవడం లేదని అన్నారు. విద్యుత్ అంతరాయం తాండూరు నుంచి ఉందని సిబ్బంది చెప్పటంతో నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కరెంట్ సక్రమంగా లేకపోవటంతో ప్రజలు తమను ప్రశ్నిస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసేలా మీరు పని చేస్తున్నారంటూ అధికారులపై మండిపడ్డారు. కాగా, విద్యుత్ లైన్లలో సమస్య, వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే సరఫరా నిలిపివేస్తున్నామని అధికారులు వివరించారు. వారి సమాధానంపై సంతృప్తి చెందని నాయకులు వికారాబాద్ ఏడీఏతో ఫోన్లో మాట్లాడి విద్యుత్ సమస్యను వివరించారు. ధారూరులో విద్యుత్ అధికారుల పనితీరు సక్రమంగా లేదని, స్థానికంగా ఉండటం లేదని, విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా ఉందని వివరించారు. సోమవారం ధారూరుకు వచ్చి విద్యుత్ సమస్యపై చర్చించి పరిష్కరిస్తానని ఏడీఏ హామీ ఇవ్వటంతో వారు సబ్‌స్టేషన్ నుంచి వెనుదిరిగారు.

జిల్లా ఆసుపత్రి వద్ద కంపు కంపు

● ఇష్టారాజ్యంగా చెత్తాచెదారం పడేస్తున్న రోగులు, ప్రజలు
● చిన్నపాటి వర్షం పడితే ఎటూ వెళ్లలేని నీరు
● కలెక్టర్ ఆదేశించినా పట్టించుకోని మున్సిపల్ సిబ్బంది

తాండూరు, ఆగస్టు 17: తాండూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రోజుకు వందకు పైగా పేషెంట్లు వస్తుంటారు. అయితే, ఆస్పత్రి ఎదుట రోగులు, ప్రజలు ఇష్టారాజ్యంగా చెత్తాచెదారం వేయడంతో పాటు అక్కడే కొంతమంది యూరిన్ పాస్ చేస్తున్నారు. దానికి తోడు చిన్నపాటి వర్షం పడితే చాలు అక్కడ మురుగు నీరు నిలుస్తోంది. దుర్వాసనతో రోగులు, అటుగా వెళ్లే ప్రజలు ముక్కు మూసుకొని వెళ్లే పరిస్థితి దాపురించింది. ఆస్పత్రి ఎదుట ఇలా ఉంటే రోగం నయం కావడం కంటే.. మరిన్ని రోగాలు వచ్చే అవకాశం లేకపోలేదు. మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యమో? జిల్లా ఆస్పత్రి శానిటేషన్ విభాగం సిబ్బంది లేకపోవడమో గానీ, ఇలా జరగడానికి కారణాలు ఏమున్నది తెలియరాలేదు. గతంలో కలెక్టర్ ఈ సమస్యలపై దృష్టి సారించాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్, ఇంజనీర్ విభాగానికి చెందిన ఇన్‌చార్జి డీఈ పరిశీలించి వెళ్లారు. తదుపరి చర్యలు మాత్రం మరిచారు. ఈక్రమంలో శనివారం ఆసుపత్రికి వచ్చిన రోగులతో పాటు వాహనదారులు నానా ఇబ్బందులు పడ్డారు.


ఆస్పత్రి ముందు వేసిన చెత్త.. రోడ్డుపై నిలిచిన నీరు

కూల్చిన స్థలంలోనే మసీదును పునరుద్ధరించాలి

● సీఎం రేవంత్‌రెడ్డికి ఎంబీటీ లేఖ

హైదరాబాద్,ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సంఘవిద్రోహులు మొయినాబాద్ లో కూల్చివేసిన మసీదును యధావిధిగా అదే స్థలంలో నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని మజ్లిస్ బచావో తహ్రీక్(ఎంబీటి)అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాసారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రంలో మసీదులు కూల్చివేత సంఘటనలపై ముస్లింలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారని లేఖలో వివరించారు. మసీదు కూల్చివేత సంఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు, వక్ఫ్‌బోర్డు అధికారులు హామీ ఇచ్చినట్టు ఆయన గుర్తు చేశారు. యధాతథంగా కూల్చిన స్థలంలోనే మసీదును నిర్మిస్తామని వక్ఫ్‌బోర్డు అధికారులు హామీ ఇచ్చి మూడు వారాలు గడిచినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో తొమ్మిది మసీదులు కూల్చివేతకు గురయినా బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఫలితంగా ముస్లిం మైనారిటీలు కలిసి ఆయనను ఎన్నికల్లో తిరస్కరించారని గుర్తు చేశారు. సెక్యులర్ సీఎంగా చొరవ తీసుకుని మొయినాబాద్‌లో కూల్చినస్థలంలోనే మసీదును పునరుద్ధరించాలని, ఈ విషయంలోముస్లిం మత ప్రతినిధులతో చర్చించేందుకు తగిన సమాయాన్ని కేటాయించాలని అంజదుల్లా ఖాన్ లేఖలో సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.


బాల సభలో మాట్లాడుతున్న విద్యార్థులు

ఆకట్టుకున్న విద్యార్థుల బాలసభ

ఆమనగల్లు, ఆగస్టు 17 : ఆమనగల్లులోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం బాల సభ నిర్వహించారు. వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలసభలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బాలసభ కొనసాగింది. విద్యార్థులచే నిర్వహించిన పొడుపు కథలు, వివిధ అంశాలపై ఇచ్చిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. హెచ్ఎం పాండు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా కమిషన్ చైర్మన్‌ను కలిసిన టీఎస్ఎస్‌వో అధ్యక్షుడు లక్ష్మీనివాస్



తలకొండపల్లి, ఆగస్టు 17: తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారదను శనివారం తెలంగాణ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో శారదను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. మహిళలపై దాడులు, అత్యాచారాల నిరోధానికి కమిషన్ ద్వారా కఠిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు లక్ష్మీనివాస్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పాఠశాలలో ఆకతాయిల ఆగడాలు

యాచారం, ఆగస్టు 17: కుర్మిద్ద ఉన్నత పాఠశాలలో ఆకతాయిల ఆగడాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు సృష్టిస్తున్నారు. శనివారం విద్యార్థులు వచ్చేసరికి కిటికీల సీకులు తొలగించి ఉన్నాయి. తరగతి గదిలో బిరాని ప్యాకెట్ పడేశారు. మధ్యాహ్న భోజన వంట గదిలోని 3 నూనె ప్యాకెట్లు, 2కారంపొడి డబ్బాలు, ఇతర వస్తువులను ఎత్తుకెళ్లారు. ఇలాంటి సంఘటనలు ఇప్పటికి రెండు పర్యాయాలు జరిగినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. గ్రామానికి చెందిన కొందరు యువకుల ఇలాంటి పనులకు పాల్పడుతున్నారని, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.



కుర్మిద్ద పాఠశాల, గదిలో లభ్యమైన బిర్యానీ ప్యాకెట్

భవన నిర్మాణ కార్మికులకు సదుపాయాలు కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్

మహేశ్వరం, ఆగస్టు 17 : భవన నిర్మాణ కార్మికులకు ఇతర రాష్ట్రాల మాదిరిగా అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ అన్నారు. శనివారం మహేశ్వరంలో భవన నిర్మాణ కార్మిక సంఘంతో పాటు ఇతర కార్మికుల కూలీ రేట్లకు సంబంధించిన రేట్ల బోర్డును ఆయన ఆవిష్కరించారు. అనంతరం రామ్మోహన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మికులకు ద్విచక్ర వాహనాలు, పెన్షన్, సబ్సిడీతో కూడిన పరికరాలు అందజేస్తున్నారని, ప్రభుత్వ రంగ సంస్థల్లో పని కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నారని తెలిపారు. తెలంగాణలో ఉన్న గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఇవేమీ పట్టించుకోకుండా సెస్సు ద్వారా వస్తున్న డబ్బులను దారి మళ్లిస్తున్నారని ఆరోపించారు. పరిశ్రమల్లో కార్మికులకు కనీస వేతనాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నా.. కార్మిక శాఖ ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని అన్నారు. కార్మికులకు తగిన సదుపాయాలు కల్పించాలని, లేనిపక్షంలో కార్మికులకు అండగా సీఐటీయూ ఎంతటి పోరాటానికైనా వెనకాడబోదని హెచ్చరించారు. కార్యక్రమంలో కవిత, రవికుమార్, శేఖర్, చంద్రయ్య, శ్రీశైలం, శంకర్, చెన్నయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడవద్దు


మాట్లాడుతున్న డీఆర్డీవో శ్రీలత

కందుకూరు, ఆగస్టు 16 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న జాతీయ ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఆర్డీవో శ్రీలత తెలిపారు. 2023-24 సంవత్సరానిగాను మండలంలోని 35 గ్రామ పంచాయతీలో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు మండల పరిషత్తు కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదికను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలానికి ఈ సంవత్సరం రూ.6కోట్ల20లక్షల నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. అందులో ఆరు వేల 5 కుటుంబాలకు చెందిన కూలీలకు 3లక్షల 11వేల పనిదినాలను కల్పించినట్లు అధికారులు నివేదికలు ఇచ్చారని, దీనికిగాను భూమి అభివృద్ధి పనులకు, పండ్ల తోటల పెంపకానికి, హరితహారం ద్వారా మొక్కల పెంపకం.. గ్రామాల్లోకి తరలించడం, క్రీడాప్రాగంణం ఏర్పాటు, పశువుల పాకల నిర్మాణం వంటి పనులు చేపట్టి నేటి వరకు ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల నుంచి రూ.5కోట్ల 33లక్షల నిధులు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఇందులో ఎలాంటి అవకతవకలు వచ్చినా సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.






మేడ్చల్: నిరసన వ్యక్తం చేస్తున్న మెడికోలు


తాండూరు: ఇందిరాచౌక్‌లో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న వైద్యులు, నర్సులు


పరిగి: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు


కొడంగల్: నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్ఎస్‌యూ నాయకులు

దోషులను కఠినంగా శిక్షించాలి

● కోల్‌కతాలో హత్యాచార ఘటనపై వైద్యుల నిరసన ● ఆస్పత్రుల్లో వైద్యసేవలు బహిష్కరణ

కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై లైంగికదాడికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని వైద్యులు డిమాండ్ చేశారు. కోల్‌కతా ఘటనకు నిరసనగా వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో శనివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల ఆధ్వర్యంలో ప్రధాన వీధుల గుండా ర్యాలీలు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు.


వికారాబాద్: పట్టణంలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, విద్యార్థులు


ఘట్‌కేసర్: ప్రభుత్వాసుపత్రిలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు, నర్సులు


మర్పల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు


ఘట్‌కేసర్ రూరల్: నీలిమ ఆస్పత్రిలో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు


తాండూరు: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

శామీర్‌పేట, ఆగస్టు 17: అంగరంగ వైభోగంగా శ్రీవీరభద్ర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన శనివారం ముగిసింది. ఆలయ ప్రధానార్చకులు గడియారం మురళీధరశర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, వివిధ పార్టీల నాయకులు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, వజ్రేష్‌యాదవ్, విక్రమ్ రెడ్డి, వివిధ గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని నూతన విగ్రహమూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జడల రమేశ్ భజన బృందం ఆధ్వర్యంలో భక్తి గీతాలను ఆలపించారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ఆందోళన చేస్తున్న మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులు

ఘట్‌కేసర్, ఆగస్టు 17: ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రిలో కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న పేషెంట్ కేర్‌టేకర్స్, శానిటేషన్, సెక్యూరిటీ కార్మికులను ప్రతీనెల 5వ తేదీ వరకు జీతాలు చెల్లించాలని రాష్ట్ర మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్లూరి జయచంద్ర డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రి వద్ద కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం సిబ్బంది ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్, కార్మికులు పాల్గొన్నారు.

స్పీకర్ చొరవతోనే కొత్త పంచాయతీలు

మర్పల్లి, ఆగస్టు 17: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చొరవతోనే కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయని కాంగ్రెస్ బ్లాక్‌టు అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు సురేశ్ అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కురుగుంట, రాంపూర్ గ్రామాలు అనుబంధ గ్రామాలుగా ఇబ్బందులు ఎదుర్కోగా ఎన్నికల సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటుకు హామీ ఇవ్వడంతో పార్టీ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీని అమలు చేయడం జరిగిందని తెలిపారు. పంచాయతీలుగా ఏర్పాటు కాకుండా బీఆర్ఎస్ నాయకులు అడ్డుపడిన విషయం అందరికీ తెలుసన్నారు. ఈ సమావేశంలో నాయకులు సుభాష్‌యాదవ్, రాములు, కలీమోద్దీన్, రామేశ్వర్, దివాకర్, సంజీవరెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

బండి సంజయ్‌ను కలిసిన బీజేపీ మండల నాయకులు

పూడూరు, ఆగస్టు 17: బీజేపీ మండల నాయకులు కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను శనివారం కలిశారు. ఈసందర్భంగా మండలంలో జరిగిన దాడుల గురించి కేంద్రమంత్రికి నాయకులు వివరించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న దాడులు సహించబోమన్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు రాఘవేందర్‌పై దాడికి పాల్పడి, హత్యకు ప్రయత్నించిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలన్నారు. ఇకపై ఇలాంటి దాడులకు పాల్పడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

ప్రతి హామీని అమలు చేస్తాం: ఎమ్మెల్యే

కులకచర్ల, ఆగస్టు 17: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. చౌడాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆరుగురికి కల్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మూడు విడతల్లో రూ.2లక్షల రుణ మాఫీ చేసి చూయించారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, నాయకులు వెంకటేశ్‌గౌడ్, శివ రాంనాయక్, నర్సింహనాయక్ తదితరులు పాల్గొన్నారు.


చౌడాపూర్‌లో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

బషీరాబాద్ ఏఈవో బదిలీ

బషీరాబాద్, ఆగస్టు 17: మండలంలో సుదీర్ఘకాలం పని చేసిన ఏఈవో(వ్యవసాయ విస్తీర్ణాధికారి) పవన్‌కుమార్ నవాబుపేట్ మండలానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు శనివారం ఆయన రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో కొత్త గా ఎవరూ నియమకం కాలేదు.

నలుగురు జూనియర్ కార్యదర్శులకు ఉద్యోగోన్నతి

బషీరాబాద్ మండలంలోని నాలుగు గ్రామ పంచాయతీలకు చెందిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగన్నతి లభించింది. నీళ్లపల్లిలో శ్రీవిద్య, మర్పల్లిలో మయూరి, కొర్విచెడ్‌లో శేఖర్, రెడ్డిఘణాపూర్‌లో నయూం ఉద్యోగన్నతి పొందారు. ఈ సందర్భంగా శనివారం బషీరాబాద్ ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన కార్యదర్శులు ఎంపీడీవో గాలి యాదయ్య, మిగతా అధికార సిబ్బంది స్వీట్లు తినిపించి ఆనందాన్ని పంచుకున్నారు.

ఉత్సాహంగా రక్షాబంధన్ వేడుకలు


వికారాబాద్: మునిసిపల్ కార్మికులకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు


తాండూరు: పోలీసులకు రాఖీ కడుతున్న కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు

వికారాబాద్, ఆగస్టు 17: రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని మునిసిపల్ కార్యాలయ ఆవరణలోని గాంధీ పార్కులో మునిసిపల్ కార్మికులకు ఈశ్వర్య బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. బ్రహ్మకుమారి ఓంశాంతి భవనం ఆధ్వర్యంలో మునిసిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్ అక్కయ్య సలహాతో గాంధీ పార్కులో మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు బ్రహ్మకుమారి మధు అక్కయ్య రాఖీ కట్టారు.

తాండూరు: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో రాఖీ పండుగను ముందుగానే జరుపుకున్నారు. తాండూరులోని గాంధీనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం మున్సిపల్ కౌన్సిలర్ సంగీతా ఠాకూర్ ఆధ్వర్యంలో బాలికలు బాలురకు రాఖీలు కట్టి సోదర భావాన్ని చాటుకున్నారు. కౌన్సిలర్ సంగీత ఠాకూర్ పండగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించడంతో పాటు విద్యార్థులకు చాకెట్లు పంపిణీ చేశారు. కృష్ణవేణి టాలెంట్ విద్యార్థులు ప్రభుత్వ కార్యాలయాలలోని ఉద్యోగులకు రాఖీలు కట్టి స్వీట్లను తినిపించి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. హెచ్ఎం నాగదేవి, ఉపాధ్యాయులు మాధవి, సరిత, జగదీశ్వరిలు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: మండల కేంద్రంలోని రెయిన్‌బో పాఠశాలలో శనివారం విద్యార్థులు రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. పాఠశాలకు సెలవు ఉండటంతో సోమవారం ముందుగానే విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మేడ్చల్ టౌన్: పట్టణంలోని అత్వెల్లి ప్రభుత్వ పాఠశాలలో శనివారం విద్యార్థులు రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తోటి విద్యార్థులకు రకీలను కట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మాణిక్యాల రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మేడ్చల్ టౌన్: తోటి విద్యార్థులకు రాఖీ కడుతున్న విద్యార్థులు

శనీశ్వరుడికి ప్రత్యేకపూజలు

మోమిన్‌పేట్, ఆగస్టు 17: మండలంలోని ఎన్కతల గ్రామంలో గల శ్రీ సద్గురు శంకర భారతి, శనీశ్వరస్వామి ఆలయాన్ని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్‌రావు, సభ్యులు శుభప్రదపటేల్ దర్శించుకున్నారు. శనివారం గ్రామానికి వచ్చిన వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు వారికి స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు.


శనీశ్వరస్వామిని దర్శించుకున్న బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులు

హనుమాన్ చాలీసా పారాయణం

కొడంగల్: కొడంగల్ పట్టణ శివారులోని సిద్దనొంపు ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ చాలీసా పారాయణంను ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్నారం గ్రామ మాజీ సర్పంచ్ అనితా పకీరప్ప ఆలయంలో పూజలు, అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.ప్రశాంత్, మాజీ సర్పంచ్ రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కులకచర్ల, ఆగస్టు 17: మండలంలోని సాల్విడ్ గ్రామపరిధిలో గల దీప్లానాయక్ తండాను నూతన గ్రామపంచాయతీగా ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు గెజిట్ విడుదల చేయడంతో తండావాసులు హర్షం వ్యక్తం చేశారు. తండావాసులు శనివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కులకచర్ల మండలంలో కొత్త జీపీతో 33జీపీలుగా ఏర్పాటయ్యాయి. అందులో 19 గిరిజన తండాలు పంచాయతీలుగా ఉన్నాయి.


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దీప్లానాయక్ తండావాసులు

సంక్షిప్తంగా..

● **బషీరాబాద్:** ఎమ్మెల్యే ఆదేశాలతో బషీరాబాద్ ఎంపీడీవో యాదయ్య శనివారం నీళ్లపల్లి గ్రామాన్ని సందర్శించి చేతి పంపు మరమ్మతు చేయించారు.

● **ధారూరు:** అడవిని నరికి ఆక్రమించడం అటవీ చట్టం ప్రకారం నేరమని ధారూరు అటవీ రేంజర్ రాజేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధారూరు అటవీ రేంజ్‌లో సరిహద్దు గ్రామాలకు కొంతమంది అటవీ ప్రాంతంలోని చెట్లను రాత్రి పూట నరికివేసి ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని, వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

● **బొంరాస్‌పేట్:** మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వాసన్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఆకుకూరల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 40 రకాల ఆకుకూరలతో ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం సాయిలు, రాజేశ్వరి, హనుమంతు, జగదీశ్వరి పాల్గొన్నారు.

● **తాండూరు రూరల్:** అంతారం బైపాస్ రోడ్డు వరకు, తాండూరు విలియంమూన్ సమీపం నుంచి నాలుగు వరుసల రోడ్డు పనులు జోరుగా సాగుతున్నాయి. రోడ్డుకు అడ్డంగా ఉన్నవిద్యుత్ స్తంభాలను శనివారం ఏఈ రఘువీరారెడ్డి పరిశీలించారు.

● **కులకచర్ల:** ఇప్పాయిపల్లి ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన మమత యాదయ్య శనివారం ఎలక్ట్రిక్ బెల్ అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, సరిత పాల్గొన్నారు.

● **బొంరాస్‌పేట్:** మండలంలోని తుంకిమెట్ల చౌరస్తాలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు గౌడ సంఘం నాయకులు శేఖర్‌గౌడ్, వెంకటయ్య, అశోక్ గౌడ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

● **తాండూరు:** తెలంగాణ సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సర్వీసు రెగ్యులర్ చేసేలా ప్రభుత్వాన్ని ఒప్పించాలని కోరుతూ తెలంగాణ పీఆర్టీయూ వ్యవస్థాపకులు హర్షవర్ధన్‌ను సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు.

● **దోమ:** బుద్లాపూర్ గ్రామానికి చెందిన జార్పుల పాండు పెసర పంటను మండల గణాంకాల అధికారి సందీప్‌రెడ్డి శనివారం పరిశీలించారు.

● **కులకచర్ల:** బండవెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వరస్వామి చిన్న జాతర సందర్భంగా కొబ్బరి కాయల విక్రయానికి ఈ నెల 22న వేలం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ నర్సమ్మ, ఈవో సుధాకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

● **నవాబుపేట:** రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ మండల ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొంత మందికే రుణాలు మాఫీ చేయడం సరైంది కాదన్నారు.

● **తాండూరు:** తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని తాండూరు మున్సిపల్ కౌన్సిలర్ వరాల శ్రీనిష్ రెడ్డి కలిశారు. శనివారం హైదరాబాద్ నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలిసి వార్డు అభివృద్ధికి నిధులివ్వాలని విజ్ఞప్తి చేశారు.

● **కీసర రూరల్:** మున్సిపల్ పరిధి రాంపల్లిలో, రాజ్‌సుఖ్‌నగర్ కాలనీలో రూ.43లక్షలతో చేపట్టిన అంగన్‌వాడీ భవనాలను నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి శనివారం ప్రారంభించారు.

● **బషీరాబాద్:** బషీరాబాద్ మండల సర్వేయర్‌గా వై.రవి శనివారం బాధ్యతలు స్వీకరించినట్లు తహసీల్దార్ వై.వెంకటేష్ వెల్లడించారు.

● **పరిగి:** మహిళలను కించపర్చేవిధంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్ వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి హనుమంతు, పరిగి పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ డిమాండ్ చేశారు. పరిగిలో శనివారం కేటీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

● **బంట్వారం(కోట్‌పల్లి):** మండల వ్యాప్తంగా 2023-24 సంవత్సరానికి సంబంధించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద 18గ్రామ పంచాయతీలకు గాను 6కోట్ల94లక్షల పనులు నిర్వహించినట్లు ఏపీఓ ఎలీష తెలిపారు.

● **పూడూరు:** కాంగ్రెస్ పార్టీకి చెన్‌గోముల్ పోలీసులు తొత్తులుగా మారారని బీజేపీ మండల అధ్యక్షుడు రాఘవేందర్ ఆరోపించారు. మన్నెగూడలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలపై ఎలాంటి దాడులకు పాల్పడినా సహించేది లేదని అన్నారు.

● **బషీరాబాద్:** కొర్విచెడ్‌ఘని గ్రామ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎట్టకేలకు శనివారం ప్రారంభించారు. ఏజెన్సీ నిర్వాహకుల కుటుంబంలో ఒకరికి టీబీ సోకిందని, ఆమె వండిపెడితే భోజనం చేయామని 14రోజులుగా విద్యార్థులు మానేసిన విషయం తెలిసిందే.

● **తాండూరు రూరల్:** తాండూరు టెక్నికల్ ఏవోగా హిమబిందు శనివారం తాండూరు వ్యవసాయ శాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు తాండూరు టెక్నికల్ ఏఈవోగా ఇక్కడ పనిచేసిన ఝాన్సీ సంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో రాజేంద్రనగర్ వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తున్న హిమబిందు నూతన టెక్నికల్ ఏవోగా నియమితులయ్యారు.

క్రైం కార్నర్

అంతర్‌జిల్లా నేరస్తుడి అరెస్ట్

వికారాబాద్, ఆగస్టు 17: వరుసగా దొంగతనాలు చేస్తున్న అంతర్ జిల్లా నేరస్తుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొడంగల్ మండలం నాగారం గ్రామానికి చెందిన అడవిమీది నర్సింహులు కరన్‌కోట్ పరిధిలో సెప్టెంబర్ 11న, 2023లో హనుమప్ప అనే వ్యక్తి ముత్తూట్ ఫైనాన్స్‌లో కుదవ పెట్టిన రెండు తులాల బంగారాన్ని తీసుకుని తన గ్రామానికి వెళుతున్నాడు. మార్గమధ్యలో గౌతాపూర్ చౌరస్తా వద్ద బాధితున్ని పరిచయం చేసుకుని తానూ చిట్టిఘనపూర్ వెళుతున్నానని రమ్మని చెప్పి తన బైక్ పైన ఎక్కించుకున్నాడు. కొంత దూరం వెళ్లాక నిందితుడు బైక్ ఆపి మద్యం తీసుకొచ్చి నర్సింహులు తాగించాడు. అతడి వద్ద ఉన్న రెండు తులాల బంగారం జాగ్రత్తగా పెట్టుకుంటా అని తీసుకొని పరారయ్యాడు. అదేవిధంగా బషీరాబాద్‌కు చెందిన తలారి కాషప్ప బషీరాబాద్‌లోని దక్కన్ గ్రామీణ బ్యాంక్‌లో క్రాప్‌లోన్ తీసుకొని మిర్చి బండి దగ్గర మిర్చిలు తింటుండగా నేరస్తుడు తానూ పర్వతపల్లికి వెళ్తున్నా అని తన బైక్ పైన ఎక్కించుకున్నాడు. క్రాప్‌లోన్ డబ్బులు రూ.35 వేలు తీసుకొని తన బైక్ కవర్‌లో పెట్టుకొని కొంత దూరం వెళ్లాక మార్గమధ్యలో కాషప్పకు మద్యం తాగించి, పెట్రోల్ పోసుకొని వస్తా ఇక్కడే ఉండమని నమ్మించి మోసం చేశాడు. ఈనెల 11న జుట్టు నర్సింహులు కోస్గి మార్కెట్‌కు ఎడ్లను కొనుగోలు చేయడానికి రాగా నిందితుడు ఈ ఎడ్లు తనవేనని కొనుక్కో అని చెప్పి నర్సింహులు వద్ద ఉన్న రూ.60వేలు తీసుకొని డీసీఎం తీసుకొని వస్తా అని చెప్పి మోసం చేశాడన్నారు. అతడి వద్ద దోచుకున్న నగదు, బంగారం స్వాధీనం చేసుకున్నామని, ఈ మేరకు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు. ఈ కేసును చేధించిన తాండూరు రూరల్ సీఐ అశోక్ , సీసీఎస్ సీఐ బలవంతయ్య, కరన్‌కోట్ ఎస్ఐ విఠల్ రెడ్డి, పోలీసు కానిస్టేబుల్స్ చెన్నయ్యగౌడ్, గోవిందప్ప, కృష్ణారెడ్డి, అంజప్ప, సత్తయ్య, రాఘవేందర్ రెడ్డి, రామకృష్ణలకు రివార్డు అందజేశారు.

మద్యం మత్తులో వ్యక్తి బలవన్మరణం


మృతుడు మహేష్

కీసర రూరల్, ఆగస్టు 17: మద్యం మత్తులో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధి నాగారంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అన్నంరాజ్ మహేష్(47) నాగారం మున్సిపాలిటీ శ్రీరామలింగేశ్వర కాలనీలో తన కుటుంబసభ్యులతో నివాసముంటున్నాడు. శుక్రవారం రాత్రి మద్యం మత్తులో ఉన్న మహేందర్ భార్య, పిల్లలను బెడ్‌రూంలో నిద్రించాలని చెప్పి, తను హాల్‌లో పడుకుంటానని కుటుంబసభ్యులకు చెప్పాడు. కుటుంబసభ్యులు తెల్లవారుజామున లేచి చూసేసరికి ఫ్యాన్‌కు ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. మహేష్ మృతికి గల కారణాలు తెలియరాలేదు.

వీధి కుక్కల దాడిలో మేకలు మృత్యువాత

కీసర, ఆగస్టు 17: వీధికుక్కల దాడిలో నాలుగు మేకలు మృత్యువాతపడ్డాయి. ఈ ఘటన కీసరలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కీసర గ్రామానికి చెందిన కందాడి రామ్‌గోపాల్‌రెడ్డి తనకున్న మేకలను శనివారం పొలం వద్ద మేతకు వదిలాడు. అయితే వీధి కుక్కలు గుంపుగా వచ్చి మేకలపై దాడి చేయడంతో నాలుగు మేకలు మృత్యువాతపడ్డాయి.

గన్‌తో బెదిరించి హత్యాయత్నం

పూడూరు ఆగస్టు 17: బీజేపీ మండల అధ్యక్షుడు రాఘవేందర్‌పై హత్యాయత్నం జరిగింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కద్మూరు ఆనందం గన్‌తో తనను బెదిరించాడని రాఘవేందర్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు చెన్‌గోముల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. శుక్రవారం తెల్లవారు జామున కారులో తనను వెంబడిస్తే పారిపోయి ప్రాణాలు దక్కించుకున్నానంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. ఆనందంతోపాటు కారులో ఓ హెడ్ కానిస్టేబుల్, ఓ హోంగార్డు, ఎస్ఐ కూడా ఉన్నారని తెలిపాడు. పోలీసులే డ్యూటీలో ఉండి ప్రైవేటు వ్యక్తి కారులో రాఘవేందర్ ఇంటికి వెళ్లడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. రాఘవేందర్‌కు ఏదైనా జరిగితే పూర్తి బాధ్యత పోలీసులే వహించాలని బాధితుడు డిమాండ్ చేశాడు. పూడూరు మండలం ఎన్కెపల్లిలో సర్వేనెంబర్-99 భూమి విషయంలో కొంత కాలంగా గొడవ జరుగుతోందని ఈ విషయమై గతంలో ఆర్డీవోకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినందునే తనపై హత్యాయత్నానికి పాల్పడ్డాడని రాఘవేందర్ ఆరోపించాడు.

అత్తింటి వేధింపులు తాళలేక పోలీసులకు ఫిర్యాదు

కీసర, ఆగస్టు17: అత్తింటి వేధింపులు తాళలేక ఓ గృహిణి కీసర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం కీసర గ్రామానికి చెందిన పుంద్రు మౌనికకు బోడుప్పల్‌కు చెందిన నాగేష్‌కు వివాహం జరిగింది. కొంత కాలంగా భర్త నాగేష్, మామ మైసయ్య, అత్తయ్యలు పాపమ్మ, బాలమణి, ఆడపడుచులు మహేశ్వరి, రజితలు వేధిస్తున్నారని మౌనిక ఫిర్యాదు చేసింది. మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటయ్య తెలిపారు.

లంబాడ సంక్షేమ వ్యవస్థాపక అధ్యక్షుడిపై కేసు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 17: ప్రభుత్వ అధికారులకు మామూళ్లు ఇవ్వాలంటూ తోటి గిరిజనులను బెదిరిస్తూ వసూళ్లకు పాల్పడుతున్న రాష్ట్ర లంబాడి సంక్షేమ వ్యవస్థాపక అధ్యక్షుడు ధన్‌రాజ్ నాయక్‌పై మేడ్చల్ పోలీసులు శనివారం కేసునమోదు చేశారు. మేడ్చల్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సైదోని గడ్డకు చెందిన ధన్‌రాజ్ నాయక్ స్థానికంగా ఉన్న కిషన్ అనే వ్యక్తితో పాటు, గిరిజన తండా పరిసరాల్లో ఉన్న ఇటుక బట్టీల యజమానులని తను విజిలెన్స్ మానిటరీ సభ్యుడినని, ప్రతీనెల తనకు మామూళ్ల రూపకంగా డబ్బులు పంపాలని వేధించటం ప్రారంభించాడు. గత ఫిబ్రవరి నెలలలో రూ.2లక్షలు డిమాండ్ చేయగా సదరు బాధితులు అడిగిన నగదును సమర్పించుకున్నారు. తిరిగి జూలై మాసంతో విజిలెన్స్ అధికారులకు మరో రూ.3 లక్షలు ఇవ్వాలని ఇటుక బట్టీల వ్యాపారస్తులను, కిషన్‌ను బెదిరించగా కిషన్ మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు విచారణ జరిపి ధన్‌రాజ్ నాయక్‌పై కేసు నమోదు చేశామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

నీళ్లపల్లి అటవీ భూముల సమస్యను పరిష్కరించాలి

బషీరాబాద్, ఆగస్టు 17: మండల పరిధిలో తెలంగాణ-కర్ణాటక అటవీ ప్రాంత హద్దుల సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. టవీశాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్కతో శనివారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని నీళ్లపల్లి, ఇస్మాయిల్‌పూర్, మైల్వార్ గ్రామాల పరిధిలో పోడు భూముల సమస్యతో పాటు అటవీ ప్రాంత సరహద్దు వివాదం ఏళ్ల తరబడి పరిష్కారం కావడంలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా మంత్రులు వెంటనే స్పందించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లు, అటవీశాఖ ఉన్నతాధికారులు కూడా ఉండటంతో త్వరితగతిన చర్యలు తీసుకోవాలని మంత్రులు అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

నాసిరకం పనులపై కడా ప్రత్యేకాధికారికి ఫిర్యాదు

కొడంగల్, ఆగస్టు 17: కొడంగల్ మున్సిపల్ పరిధిలోని సర్వే నెం.825లో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్లలో నాసిరకం పనులు, అవకతవకలపై కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం అక్కడికి చేరుకొని నాసిరకం పనులు చేపట్టొదంటూ పనులను నిలిపి వేసి కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దాము, దస్తప్ప, సాయిలు, అశోక్, అంజి, శివ, నితిన్, విజయ్, రమేశ్‌బాబు, మల్కప్ప, గోపాల్ పాల్గొన్నారు.

మా గ్రామాలను యాదాద్రిలో కలపొద్దు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 17: తమ గ్రామాలను యాదాద్రీ జిల్లాలో కలపొద్దని మంత్రి శ్రీధర్‌బాబును శనివారం విలీన గ్రామాల నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలో కొనసాగుతున్న అవుశాపూర్, అంకుషాపూర్, మాధారం గ్రామాలను యాదాద్రీ జిల్లా బీబీనగర్ మండలంలో కలుపొద్దని జిల్లా మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్ళారు. ఈ కార్యక్రమంలో విలీన గ్రామాల నాయకులు మశ్చేందర్‌రెడ్డి, వామన్‌రెడ్డి, అయిలయ్యయాదవ్, ప్రవీణ్‌రావు పాల్గొన్నారు.

ఆవుకు అంత్యక్రియలు

బషీరాబాద్, ఆగస్టు 17: బషీరాబాద్ మండలం మంతట్టి గ్రామానికి చెందిన రైతు సురేష్ వ్యవసాయంతో పాటు పశువులను పెంచుకుంటున్నాడు. అయితే, ఒక ఆవు అనారోగ్యానికి గురి కాగా చికిత్స అందిస్తున్న క్రమంలో ఆవు శనివారం ఉదయం మృత్యువాతపడింది. దీంతో సురేష్ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. వారి పొలంలో ఎక్స్‌కావేటర్‌తో గుంతను తీయించి శాస్త్రోక్తంగా పూజలు చేసి ఆవును ఖననం చేశారు. దీంతో ఆవుపై ఆ కుటుంబానికి ఉన్న ప్రేమ, అనుబంధంపై స్థానికులు చర్చించుకుంటున్నారు.


మృత్యువాతపడిన ఆవు